# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 4, జులై 2026







# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలి

- ప్రజా సమస్యలపై అధికారులు బాధ్యతగా స్పందించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా
- నిర్మల్ కలెక్టరేట్‌లో ఘనంగా దిశ కమిటీ సమావేశం

**నిర్మల్, జూలై 03, ప్రభాతవార్త:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమర్థవంతంగా కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, కేంద్రరాష్ట్ర పథకాల అమలు, పెండింగ్ పనులు, భౌతిక, ఆర్థిక పురోగతిపై శాఖల వారీగా సుదీర్ఘ సమీక్ష చేశారు. ఉపాధి హామీ, పీఎం, ఇందిరమ్మ ఇండ్లు, పీఎం కిసాన్, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ ఆరోగ్య మిషన్, పీఎం శ్రీ పాఠశాలలు, ఐసీడీఎస్, బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు, బ్యాంకింగ్ తదితర శాఖల పనితీరును పరిశీలించారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ.. ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద ప్రతి జాబ్‌కార్డు దారునికి పని కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, అంగన్‌వాడీ భవనాల

మిగతా 2లో..



# స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు

- కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, జులై 3, ప్రభాతవార్త**

స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ హరిత తెలిపారు. శుక్రవారం మండల సమైక్య భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు స్వయం సహాయక

మిగతా 2లో..



# యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్ టౌన్, జులై 3, ప్రభాతవార్త**

రైతులకు యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారి చిరంజీవికి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి మాట్లాడుతూ వానాకాలం సాగు సీజన్‌లో యూరియా కొరత, ఆన్లైన్ బుకింగ్ సమస్యలు, కొంతమంది వ్యాపారులు ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని, రైతులపై ఇతర ఉత్పత్తులు బలవంతంగా మోపే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పిడుగు శంకర్, తాళ్లపల్లి దివాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# టీకాతో నివారించగల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్
- ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల సమన్వయంతో వేగవంతమైన గుర్తింపు
- చికిత్స, ఆసుపత్రుల్లో అన్ని ధృవపత్రాలు, రుసుముల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలి

**మంచిర్యాల, జూలై 3, ప్రభాతవార్త**

జిల్లాలో టీకాల ద్వారా నివారించగల వ్యాధుల నియంత్రణపై మరింత అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ చిన్నపిల్లల వైద్య నిపుణులు, చర్మవ్యాధి నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 11 మంది చర్మవ్యాధి నిపుణులు, 22 మంది చిన్నపిల్లల వైద్య నిపుణుల ఆసుపత్రులు

మిగతా 2లో..

## స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

సంఘాల ద్వారా పొదుపును పెంపొందించుకుని రుణాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. సంఘాల సభ్యులు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుని అదనపు ఆదాయం పొందేలా ముందుకు సాగాలన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడటానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక ప్రోత్సాహం, సంఘాల సభ్యులు సమాఖ్యల ఆధ్వర్యంలో చేపడుతున్న ఉపాధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మి తెలిపారు. మహిళలు ఐక్యంగా పనిచేస్తే కుటుంబాభివృద్ధితో పాటు గ్రామాభివృద్ధికి కూడా దోహదపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్, డిఆర్డిఓ, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఓటరు సవరణ ప్రక్రియపై ఇంటింటి అవగాహన సర్వే

**- ఓటర్లకు నమోదు పత్రాల పంపిణీ**



మంచిర్యాల, ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1, 22, 23, 54 డివిజన్లలో ఓటరు సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొని ఓటర్లకు నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు దానిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఉప మేయర్ సల్ల రమ్య-మహేష్, స్థానిక కార్పొరేటర్లు, సహనియామక సభ్యులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేయూ దూరవిద్య పీజీ, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం

బెల్లంపల్లి, జూలై 03, ప్రభాతవార్త

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య (ఎస్డిఎల్సిఈ) స్టడీ సెంటర్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను పీజీ మరియు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి దూరవిద్య ఒక మంచి అవకాశం అని పేర్కొన్నారు. ఉద్యోగాలు, ఇతర బాధ్యతల కారణంగా రెగ్యులర్‌గా చదవలేని వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పీజీ కోర్సులలో ఎంఎ, ఎంకామ్ తదితర అన్ని సబ్జెక్టుల్లో ప్రవేశాలు అందుబాటులో ఉండగా, డిగ్రీ కోర్సులలో బిఏ, బీకాం, బీఎస్సీ విభాగాల్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్డిఎల్సిఈకేయు.కో.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, దరఖాస్తు ఫారం ప్రింట్ అవుట్ తీసుకుని అవసరమైన విద్యార్హత సర్టిఫికెట్లు జతచేసి రెండు సెట్లుగా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని ఎస్‌డిఎల్‌సిఈ స్టడీ సెంటర్‌కు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పీజీ కోర్సులకు స్టడీ సెంటర్ కోడ్ 770, డిగ్రీ కోర్సులకు స్టడీ సెంటర్ కోడ్ 043 ఉపయోగించాలని పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 9959269975 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. దూరవిద్య ద్వారా పీజీ లేదా డిగ్రీ పూర్తి చేయాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ సూచించారు.

## ఒకే దరఖాస్తుతో బహుళ విద్యుత్ కనెక్షన్లు

**- వినియోగదారులకు టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక సౌకర్యం**

ఆసిఫాబాద్, జూలై 3, ప్రభాతవార్త

విద్యుత్ వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శక సేవలను అందించాలనే లక్ష్యంతో అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాల కోసం ఖుబల్క్/మల్టిపుల్ అప్లికేషన్స్ రిజిస్ట్రేషన్‌గ్గ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆసిఫాబాద్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా ఒకే భవనంలో అవసరమైన అన్ని విద్యుత్ కనెక్షన్ల కోసం విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా ఒకే దరఖాస్తుతో అన్ని కనెక్షన్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. దీంతో బిల్డర్లు, డెవలపర్లు, భవన యజమానులు, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్వాహకులు తక్కువ సమయంలో సులభంగా విద్యుత్ కనెక్షన్లు పొందవచ్చని తెలిపారు. అపార్ట్‌మెంట్లు, మల్టీ స్టోరీడ్ భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అవసరమైన బహుళ ఎల్టి కేటగిరీ1, కేటగిరీ2 కనెక్షన్లకు ఈ విధానం వర్తిస్తుందని పేర్కొన్నారు. మొత్తం కాంట్రాక్ట్ లోడ్ ఆధారంగా చార్జీలు నిర్ణయించబడతాయని, 20 కిలోవాట్ల వరకు డెవలప్‌మెంట్ చార్జీలు, సర్వీస్ లైన్ చార్జీలు వర్తిస్తాయని, 20 కిలోవాట్లకు పైగా కేవలం సర్వీస్ లైన్ చార్జీలు మాత్రమే వసూలు చేయబడతాయని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 1912 లేదా 18004250028 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆసిఫాబాద్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సూచించారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని, రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యను పరిష్కరించి, నిర్మాణాల్లో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.. భైంసా సమీప జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, బాసర వంతెనను ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని కోరారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అర్హులకు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ మ్యాప్‌లు లేని 14 గ్రామాల్లో సర్వేలు, 70 గ్రామాల్లో రీసర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు.

**పథకాల పురోగతి వివరాలు:** జిల్లాలో 1.74 లక్షల జాబ్‌కార్డుదారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల కింద 2,136 గృహాలు పూర్తిచేసి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.146 కోట్లు జమ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి రూ.17.74 కోట్లు, 20 పీఎం శ్రీ పాఠశాలలకు రూ.1.34 కోట్లు వ్యయం చేశారు. 2.49 లక్షల రేషన్ కార్డుల ద్వారా ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, 41,950 కొత్త కార్డులు జారీ చేశారు. పీఎం కిసాన్ కింద 53 వేల మంది రైతులకు రూ.32 కోట్ల ఆర్థిక సాయం అందించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్‌వో రాథోడ్ రమేష్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మోనిక, భైంసా చైర్మన్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ

**- ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలి**

**- జేసీఐ నిర్మల్ స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు వడేకర్ లక్ష్మణ్**

భైంసా, జులై 03, ప్రభాతవార్త:

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భైంసా పట్టణంలో జేసీఐ నిర్మల్ స్ఫూర్తి ఆధ్వర్యంలో వినూత్న ప్రాజెక్ట్‌గా స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పునర్వినియోగానికి అనువైన స్టీల్ వాటర్ బాటిళ్లను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని ఏ విధంగా పరిరక్షించవచ్చో ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్కసారి ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ నీటి బాటిళ్ల వినియోగానికి స్వస్తి చెప్పి, స్టీల్ లేదా ఇతర పర్యావరణ హిత బాటిళ్లను అలవాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, నిత్య జీవితంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను పూర్తిగా నిషేధించాలని, వాటికి బదులుగా గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు వంటి పర్యావరణ హితమైన వాటిని ఉపయోగించాలని కోరుతూ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. జేసీఐ నిర్మల్ స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు జేసీ వడేకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని గుర్తుచేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడం ద్వారానే భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, హరిత వాతావరణాన్ని అందించగలమన్నారు. జేసీఐ నిర్మల్ స్ఫూర్తి ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక పర్యావరణ హిత కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ జేసీ డాక్టర్ సురేష్ అల్లాడి, సెక్రటరీ జేసీ డి. విశ్వశ్రీ, ట్రెజరర్ జేసీ అనిల్ దుగ్గే, వైస్ ప్రెసిడెంట్ జేసీ జి. సాయినాథ్, సభ్యులు జేసీ రమేష్ కె., జేసీ లక్ష్మణ్ తోట తదితరులు పాల్గొన్నారు.






## శ్రీ పోచమ్మ తల్లి ఆలయ మహోత్సవంలో మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సురేఖ

**- ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం**

**- ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు**

మంచిర్యాల, జూలై 3, ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ బావి పోచమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి పనుల నిమిత్తం ఆమె రూ లక్ష రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో రైతులు, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం స్థానిక కార్పొరేటర్ శేర్ లక్ష్మి-పవన్, ఆలయ కమిటీ సభ్యులు సురేఖని శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఉప మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీకాతో నివారించగల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

వైద్య సంస్థల నమోదు చట్టం కింద నమోదై ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాలంటే ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. టీకాలతో నివారించగల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల వైద్యులు, చర్మవ్యాధి నిపుణులు వ్యాధుల పర్యవేక్షణలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. జిల్లా వ్యాధి పర్యవేక్షణ అధికారులు ప్రైవేటు ఆసుపత్రులను తరచుగా సందర్శిస్తూ అవసరమైన వివరాలు సేకరించాలని ఆదేశించారు. అనుమానాస్పద కేసులు గుర్తించిన వెంటనే రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించాలన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో సమాచార మార్పిడికి ప్రత్యేక సందేశ బృందాన్ని ఏర్పాటు చేసి రోజువారీ సమాచారం సేకరించాలని సూచించారు. జిల్లాలో వేగవంతమైన స్పందన బృందం ద్వారా తక్షణ చర్యలు చేపట్టి, అవసరమైన పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా మీజిల్స్, డిఫ్తీరియా, ధనుర్వాతం వంటి టీకాతో నివారించగల వ్యాధులపై పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉండాలని, ప్రతి కేసు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, వైద్య సంస్థల నమోదు చట్టం ప్రకారం అన్ని ఆసుపత్రులు అవసరమైన ధృవపత్రాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని హెచ్చరించారు. అగ్నిమాపక అనుమతి, జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నమోదు ధృవపత్రాలు, వైద్యుల వివరాలు, సేవల రుసుములు, నిపుణుల సేవల సమయాలు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలన్నారు. సంప్రదింపు రుసుములు, ఇతర చార్జీల వివరాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రదర్శించాలని సూచించారు. రోగులకు తాగునీరు, కూర్చునే సౌకర్యం వంటి ప్రాథమిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. నిబంధనలు పాటించని ఆసుపత్రులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నివాస వైద్య అధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా మాధ్యమ విభాగ అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా కార్యక్రమ అధికారి ప్రశాంతి, ఉప జిల్లా వైద్య నిర్వహణ అధికారి ప్రవళిక, వ్యాధి పర్యవేక్షణ సిబ్బంది సుమన్‌తో పాటు జిల్లాలోని చిన్నపిల్లల, చర్మవ్యాధి వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## అనారోగ్య కారణంతో యువకుడి ఆత్మహత్య

సారంగాపూర్, జులై 03, ప్రభాతవార్త:



మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన యువకుడు గోపులార్ ప్రవీణ్ (20) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ గత కొన్ని సంవత్సరాలుగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ వంజర్ గ్రామానికి వస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చిన ప్రవీణ్, తీవ్రమైన అనారోగ్యం, కొన్ని కుటుంబ సమస్యల వల్ల మనస్తాపం చెందారు. దీంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ప్రాణాలు కోల్పోయారు. మృతుడి తల్లి రూప ఇచ్చిన దరఖాస్తు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



వివరాలను వెల్లడిస్తున్న సంఘం అధ్యక్షుడు తోట రాము

## ఎస్ఆర్ఐపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**- గణేష్‌నగర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తోట రాము**

భైంసా, జులై 03, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని గణేష్ నగర్ ప్రజలకు ఎస్ఆర్ఐ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తోట రాము అన్నారు. గణేష్ నగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఐ యొక్క ప్రాముఖ్యత, దాని వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాలు, ప్రయోజనాలు, ఇతర సంబంధిత ప్రధాన అంశాలపై నిర్వాహకులు, నిపుణులు పూర్తి వివరాలను తెలియజేస్తారు. ఈ వినూత్న కార్యక్రమానికి గణేష్ నగర్ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో తప్పకుండా హాజరై, ఇందులో వివరించే విషయాలను తెలుసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తోట రాము కోరారు.

## హైస్కూల్ ఉపాధ్యాయుడు కిషోర్‌కు ఘన సన్మానం

**- తేజాపూర్ గ్రామస్తులు, విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం**

నేరడిగొండ, జులై 03, ప్రభాతవార్త:

మండలంలోని తేజాపూర్ గ్రామంలో హైస్కూల్ ఉపాధ్యాయుడు కిషోర్‌కు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) సభ్యులు, గ్రామ ప్రజలు కలిసి ఘనంగా సన్మానం చేశారు. ఉపాధ్యాయుడిగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కిషోర్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన విద్యాబోధన గ్రామంలోని ఎంతోమంది విద్యార్థులకు ప్రయోజనకరంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# కవిత అరెస్టు తీరు అత్యంత అభ్యంతరకరం

**- రియాజ్ అహ్మద్, ఉదారి చంద్రమోహన్ గౌడ్ - ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్**

**- ఈనెల 20 లోపు మెడికల్ బోర్డు నిర్వహించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు హెచ్చరిక**

నస్పూర్, జులై 3, ప్రభాతవార్త

ప్రభుత్వ హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భూ పోరాటం చేపట్టిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితను అరెస్టు చేసిన తీరు అత్యంత అభ్యంతరకరంగా ఉందని హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్, టీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక మహిళా నాయకురాలు పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని, ఈ క్రమంలో పలువురు ఉద్యమకారులకు గాయాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ తెలంగాణ ద్రోహులకు సీట్లు, పదవులు ఇస్తోందని ఆరోపించారు. ఉప్పల్‌లో కవిత చేపట్టిన భూ పోరాట కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు లోపాయకారీగా ఒకటయ్యాయని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కేటీఆర్ కలిసి కల్వకుంట్ల కవితను టార్గెట్ చేశారని రియాజ్ అహ్మద్, చంద్రమోహన్ గౌడ్ ఆరోపించారు. కవిత చేపట్టిన బాయిబాట్ల కార్యక్రమానికి పోటీగా హరీష్ రావు సింగరేణి పర్యటనలు పెట్టుకున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సింగరేణిలో గనులు, కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గాయని, వందల కోట్ల సింగరేణి నిధులను హరీష్ రావు, కేటీఆర్ తమ సొంత నియోజకవర్గాలకు మళ్లించుకున్నారని మండిపడ్డారు. సింగరేణి కార్మికులు చేపట్టిన సకల జనుల సమ్మెతోనే తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరిందని, రాష్ట్ర ఏర్పాటులో కార్మికుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణిలో కొత్త గనులు, ప్రాజెక్టులు ప్రారంభించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సంపూర్ణ మద్దతు కల్వకుంట్ల కవితకు ఉందని, భవిష్యత్తులో ఆమె రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీలోపు మెడికల్ బోర్డు నిర్వహించకపోతే హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్, ఉదారి చంద్రమోహన్ గౌడ్

## ఎస్ఆర్‌పీ 3 ప్రమాదంపై నిష్పక్షపాత విచారణ జరపాలి

గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ 3 గనిలో జరిగిన ప్రమాదం సైడ్ ఫాల్ కాదని, అది ముమ్మాటికీ రూఫ్ ఫాల్ ప్రమాదమేనని హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం గనుల్లో జరుగుతున్న పలు ప్రమాదాల వివరాలను బయటకు రాకుండా దాస్తోందని ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన అధికారులను తక్షణమే బదిలీ చేసి, నిష్పక్షపాత విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సీఎండీ, డైరెక్టర్లు ఏసీ గదుల్లో కూర్చొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు చేయడం కాకుండా, క్షేత్రస్థాయిలోకి వచ్చి గనులను సందర్శించి కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వి. అనిల్ రెడ్డి, నాయకులు ఎర్రం శెట్టి సాయి కుమార్, తుల అనిల్ కుమార్, కాసర్ల అశోక్ రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోరకొప్పుల మహేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు రాసకొండ సురేష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు హరికరావు, ఉమ్మడి ఆదిలాబాద్ మీడియా ఇంచార్జి వేముల సాయి కుమార్ గౌడ్, నాయకులు రామ్మోహన్ చారి, జహీర్ ఖాన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాకేష్ కుమార్

## గ్రామాలలో పర్యటించి పనులను పరిశీలించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

**- క్షేత్రస్థాయిలో నాణ్యత ప్రమాణాల పరిశీలన**

సారంగాపూర్, జులై 03, ప్రభాతవార్త:

మండలంలోని చించోలి(ఎం), కంకేట, బీరవెల్లి గ్రామాలలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాకేష్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను, వాటి నాణ్యతను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనుల పురోగతిని, వీవో భవనాలు, వర్క్ షెడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లోని బోర్‌వెల్స్ పనితీరు, భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన ఇంకుడు గుంతల విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ తీరును ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధుల వినియోగం, సిబ్బంది పనితీరుపై సర్పంచులు, ఉపాధ్యాయులు, స్థానిక అధికారులతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వెంట ఎంపీడీవో లక్ష్మీకాంత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సాహెబ్ రావ్, దాసరి విజయ లక్ష్మణ్, గంగామణి ఎల్లన్న, ఏపీవో మంజుల, ఏఈ నాగార్జున, ఈసీ సాగర్, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంఆర్ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, జులై 3, ప్రభాతవార్త

జిల్లాలో సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, టాస్క్ ఫోర్స్ ఓ.ఎస్.డి. శ్రీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించి సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, రైస్ మిల్లర్లు లక్ష్య సాధన దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు చేయవలసిన చెల్లింపులను త్వరగా పూర్తి చేయాలని, డీలర్లకు కేటాయించిన ప్రకారంగా ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని తెలిపారు. డిఫాల్టర్లు త్వరగా బకాయిలు 70 శాతం వరకు చెల్లించాలని, ఆగస్టు 31వ తేదీలోగా సిఎంఆర్ డెలివరీ పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

# పీఆర్సీని వెంటనే అమలుపరచాలి

**- పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు డిమాండ్**

**భైంసా, జులై 03, ప్రభాతవార్త:**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి అమలుపరచాల్సిన పీఆర్సీని 50 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2026 సంఘ సభ్యత్వ సేకరణలో భాగంగా గురువారం మండలంలోని ఏపీ నగర్, మాటేగాం, కోతులగాం, మాగం, మిర్జాపూర్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలతో పాటు పిప్పిరి, ఎక్గాం, బిజ్జూర్, చింతల్‌బోరి పాఠశాలల్లో ఉపాధ్యాయ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లకు ఒకసారి అమలు కావాల్సిన పీఆర్సీ ఎనిమిదేళ్లు గడిచినా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తక్షణమే పీఆర్సీని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లుల కోసం సంఘం ప్రాతినిధ్యం మేరకు ప్రభుత్వం నెలకు రూ. 2 వేల కోట్ల నిధులు విడుదల చేస్తోందని, దీనిని ఇలాగే కొనసాగించి రాబోయే మూడు నెలల్లో పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న ఆగస్టు నెలలో ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించేలా సంఘం కృషి చేస్తోందని తెలిపారు.ఆసుపత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం అతి త్వరలోనే ఒప్పందం కుదుర్చుకుని హెల్త్ స్కీమ్ పూర్తిగా అమలయ్యేలా సంఘం ఇదివరకే ప్రభుత్వానికి విన్నవించిందన్నారు. పీఆర్టీయూ సంఘం చేసిన కృషి వల్లే ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేయడానికి ముఖ్యమంత్రి ఇదివరకే రాష్ట్ర సంఘానికి హామీ ఇచ్చారని, దానికి అనుగుణంగానే ప్రత్యేక టెట్ ఫలితాల అనంతరం ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించేలా సంఘం ఒత్తిడి తెస్తుందని చెప్పారు.యాభై సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన పీఆర్టీయూ నిరంతరం ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సంఘ బలోపేతానికి కృషి చేస్తూనే, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా మండల అధ్యక్షుడు ఎస్. గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సలీం అహ్మద్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండల ఉపాధ్యక్షుడు కె. బాబురావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## నిమ్స్‌లో చికిత్సకు రూ.3.50 లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

**- కల్యాణ్ వైద్య ఖర్చులకు ఇప్పటివరకు రూ.15 లక్షల ప్రభుత్వ సాయం**

**నిర్మల్, జులై 03, ప్రభాతవార్త:**

అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోన్ మండల కేంద్రానికి చెందిన కట్టె కల్యాణ్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం రూ.3.50 లక్షల ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కును నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణ్ గత ఏడాది కాలంగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని, ఆయన వైద్యం కోసం ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎల్‌వోసీ ద్వారా రూ.15 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన కల్యాణ్‌కు వైద్య ఖర్చుల భారం కాకుండా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆపద సమయంలో స్పందించి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి కల్యాణ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బజారుకు బట్టసంచితోనే వెళ్లాలి.. ప్లాస్టిక్‌కు పూర్తిగా గుడ్‌బై చెప్పాలి

**- ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు**

**- భావితరాల రక్షణకు ప్రతి పౌరుడు బాధ్యత వహించాలి**

**మంచిర్యాల, జూలై 3 ప్రభాతవార్త**

అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలో ప్లాస్టిక్ సంచుల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ క్లబ్ హైటెక్ సిటీ ఆధ్వర్యంలో, ప్రకృతిమిత్ర పర్యావరణ సంస్థ సౌజన్యంతో శ్రీ హర్ష జూనియర్ కళాశాల విద్యార్థినుల కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ వాల్టా పర్యావరణ చట్ట రాష్ట్ర సభ్యులు, ప్రకృతిమిత్ర వ్యవస్థాపకులు గుండేటి యోగేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కసారి ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా గాలి, నీరు, నేల, చెట్లు, జీవ వైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు.ప్రతి పౌరుడు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు బట్ట, జనపనార, ఉన్ని, కాగితం వంటి ప్రకృతి హిత సంచులను స్వచ్ఛందంగా వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానివేసి ప్రకృతి మిత్రులుగా మారాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ చోటు పుడమికి చేటు అని పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ హైటెక్ సిటీ అధ్యక్షులు రాజుపటేల్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. యువత ముందుకు వచ్చి సమాజంలో మార్పుకు దారితీయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల వివిధ ప్రకృతి హిత సంచులు, వస్తువులను ప్రదర్శించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హైటెక్ సిటీ సభ్యులు సిహెచ్ హనుమంతరావు, కళాశాల ప్రధానాచార్యురాలు లావణ్య, సంస్థ సభ్యులు బి. రాజశేఖర్, ఎం. శరత్ చంద్ర, ఎన్. రాజేంద్రప్రసాద్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.




బట్ట సంచితో బజార్ వెళ్లాలని అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## అంబవాయి చెరువు తూము మరమ్మతులు చేయించిన శ్రీహరిరావు

**- బీడు భూములకు మళ్లీ సాగు నీరు..**

**- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు**

**సారంగాపూర్, జులై 03, ప్రభాతవార్త:**



మండలంలోని కౌట్ల (బి), సారంగాపూర్ గ్రామాలకు చెందిన రైతులు అంబవాయి చెరువు ఆయకట్టు కింద పొలాలను సాగు చేస్తున్నారు. అయితే గత మూడు సంవత్సరాల నుండి చెరువు తూర్పు భాగంలో ఉన్న తూము చెడిపోవడంతో సాగు నీరు అందక దాని కింద ఉన్న భూములన్నీ బీడుగా మారిపోయాయి. ఈ సమస్యపై గతంలో అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో సారంగాపూర్ నాయకుడు వీరయ్య ఆధ్వర్యంలో రైతులు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీహరిరావును కలిసి తమ సమస్యను విన్నవించారు. రైతుల కష్టాలపై సానుకూలంగా స్పందించిన ఆయన, ప్రత్యేక చొరవ తీసుకుని సొంత ఖర్చులతో తూము మరమ్మతు పనులను పూర్తి చేయించారు.తూము మరమ్మతు పూర్తయి పొలాలకు నీరు అందుతుండటంతో రైతుల ముఖాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా రైతులు, నాయకుడు వీరయ్య కలిసి శ్రీహరిరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు.



## బుగ్గారంలో పలు కుటుంబాలను పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**- మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం, ధైర్యం కల్పన**

**నేరడిగొండ, జూలై 03, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని బుగ్గారం గ్రామానికి చెందిన యువకుడు నాతరీ సతీష్ కుమార్, జాదవ్ గంగాధర్, రాథోడ్ పాండు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సతీష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సతీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం గ్రామానికి చెందిన రాథోడ్ భీంరావ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, ఆయనను పలకరించి ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, రాథోడ్ సురేందర్, నేరడిగొండ సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, ప్రతాప్, శ్రీకాంత్ రెడ్డి, నకులుడు, పాండు, సుజీల్, కైలాష్ తదితరులు ఉన్నారు.

## సబ్సిడీపై పత్తి విత్తనాలు అందజేసిన బోథ్ ఎమ్మెల్యే

**- రైతువేదికలో 192 విత్తనాల బ్యాగుల పంపిణీ**

**నేరడిగొండ, జూలై 03, ప్రభాతవార్త:**



నేరడిగొండ మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సబ్సిడీ పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు 192 పత్తి విత్తనాల బ్యాగులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న నాణ్యమైన విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో విత్తనాలు నాటుకుని వ్యవసాయ అధికారులు సూచించిన పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, ఏఈవోలు, సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్, సాబ్లే సంతోష్, సుజీల్, శ్రీకాంత్ రెడ్డి, రాథోడ్ సురేందర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

## నర్సాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**తాండూర్, జూలై 3, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని నర్సా పూర్ గ్రామంలో శుక్రవారం సిసి రోడ్డు పనులను సర్పంచ్ మడావి ప్రభాత్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ పర్వత్ రావు, నాయకులు కాపర్తి సుభాష్, సూరం దామోదర్ రెడ్డి, మాణిక్ రావు, భగవంత్ రావు, లచ్చు పటేల్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సర్పంచ్ రాంబాయి

## మొక్కలు నాటిన సర్పంచ్

**తాండూర్, జూలై 3, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని రేచిని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సర్పంచ్ పోతురాజుల రాంబాయి, అధికారులు, నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సుబ్బా దత్తుమూర్తి, ఎంపీఓ అనిల్ కుమార్, ఉప సర్పంచ్ కొడిపాక భీమయ్య, పశు వైద్యాధికారి శివప్రసాద్, గిర్దావర్ మురళీధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఈ పంచాయతీ ఆపరేటర్ కుమార్, నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బురదమయంగా మారిన పాఠశాల క్రీడాస్థలం

**- ఆటలు ఆడెందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**

**తాండూర్, జూలై 3, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని రేచిని జెడ్.పి.ఎస్.ఎస్. క్రీడాస్థలం చిన్న వర్షం పడితే బురదమయంగా మారుతున్నది. ప్రతిరోజు విద్యార్థులు పాఠశాల ఆవరణలోని క్రీడా స్థలంలో హాకీ, వాలీబాల్, క్రికెట్, త్రో బాల్ వంటి తదితర క్రీడలు ఆడుతారు. చిన్న వర్షం కురిసిన క్రీడాస్థలములో నీరు నిలుస్తుండడంతో ఆటలు ఆడేందుకు ఇబ్బందులు పడుతున్నమని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆటస్థలంలో వర్షం నీళ్ళు నిలవకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



### భారీ వర్షంలోనూ కొనసాగిన

# సింగరేణి అధికారుల రిలే దీక్షలు

**- ఐదవ రోజుకు చేరిన నిరసనలు.. పీఆర్‌పీ, పే అప్‌గ్రేడేషన్ కోసం పట్టు**

**నస్పూర్, జూలై 3, ప్రభాతవార్త**

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సీఎంఓఏఐ పిలుపు మేరకు సింగరేణి అధికారులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలో శుక్రవారం నాటికి అధికారుల రిలే నిరాహార దీక్షలు ఐదవ రోజుకు చేరాయి. ఏరియాలో కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు దీక్షా శిబిరంలో కూర్చుని తమ నిరసనను వ్యక్తం చేశారు. శుక్రవారం నాటి దీక్షలో సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ భీమన్న, డీవై పీఎం క్రాంతికుమార్, ఆర్‌కే7 అండర్ మేనేజర్ నరేష్, ఐకే ఓసీ డీవై ఎస్ఈ గుత్తుల శ్రీనివాస్, ఐకే1ఏ సీనియర్ అండర్ మేనేజర్ సాయితేజ, ఆర్‌కే ఎన్‌టీ సీనియర్ పీఓ సృజన్ పాల్, ఆర్‌కే5 సీనియర్ పీఓ హరికృష్ణ, ఎస్ఆర్‌పీ1 డిప్యూటీ మేనేజర్ నరేష్, ఎస్ఆర్‌పీ ఓసీ అండర్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వేళలో ఏరియాకు చెందిన అధికారులు పెద్ద సంఖ్యలో దీక్షా శిబిరానికి తరలివచ్చి దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యాజమాన్యం మరియు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిల చెల్లింపుతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యం నుండి స్పష్టమైన రాతపూర్వక హామీ వచ్చే వరకు తమ ఆందోళనలు ఆగేది లేదని స్పష్టం చేశారు. జూలై 13 వరకు నిరంతరాయంగా సాగే ఈ రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్క అధికారి భాగస్వాములు కావాలని, విధులకు ఆటంకం కలగకుండా రోజువారీగా సంఘీభావం తెలియజేయాలని పిలుపునిచ్చారు.

వర్షంలోనూ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న సింగరేణి అధికారులు

## శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల కేంద్రం 15వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**- దివ్యాంగుల సంక్షేమానికి శాంతినికేతన్ సేవలు అభినందనీయం**

**నిర్మల్, జూలై 03, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల కేంద్రం 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం శాంతినికేతన్ యాజమాన్యం అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. 15 ఏళ్లుగా నిరంతరాయంగా దివ్యాంగులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి అవసరమైన విద్య, వైద్య సేవలు అందిస్తున్న తీరు స్ఫూర్తిదాయకమన్నారు. కేంద్రం అభివృద్ధికి ప్రభుత్వం తరఫున సాధ్యమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, పట్టణ బీజేపీ నాయకులు శనిగారపు చిన్నయ్య, అయిండ్ల సాత్విక్, గొజ్జ జనార్ధన్, పలువురు వైద్యులు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా దివ్యాంగ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## కేజీబీవీలో విద్యార్థినులకు యూనిఫార్మ్‌ల పంపిణీ

**నస్పూర్, జూలై 3, ప్రభాతవార్త**



నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో (కేజీబీవీ) శుక్రవారం విద్యార్థినులకు యూనిఫార్మ్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జీఈసీఓ విజయలక్ష్మి, సెక్టోరల్ అధికారి4 కృష్ణమూర్తి, స్థానిక మున్సిపల్ కార్పొరేటర్ యశోద ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థినులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థినులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ నస్పూర్ స్పెషల్ ఆఫీసర్ ఎస్. మోనిక, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సుకు ఎంపికైన ఆసిఫాబాద్ డీపీఆర్‌వో సంపత్‌కుమార్

**ఆసిఫాబాద్, జులై 3, ప్రభాతవార్త :**



ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్‌వో) సంపత్ కుమార్ ఢిల్లీలో నిర్వహించనున్న మీడియా కమ్యూనికేషన్ అధికారుల జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలెక్షన్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా ఎంపికైన మీడియా, కమ్యూనికేషన్ అధికారులతో కలిసి ఆయన పాల్గొననున్నారు. సదస్సులో మీడియా నిర్వహణ, ప్రజా కమ్యూనికేషన్, ఎన్నికల సమాచార ప్రచారం, ఆధునిక సమాచార వ్యూహాలు, డిజిటల్ కమ్యూనికేషన్ తదితర అంశాలపై నిపుణులు నిర్వహించే సాంకేతిక సెషన్‌లలో సంపత్ కుమార్ పాల్గొని తాజా విధానాలు, ఉత్తమ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన కొద్దిమంది అధికారుల్లో ఆసిఫాబాద్ జిల్లా డీపీఆర్‌వో సంపత్ కుమార్ ఒకరు కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాడుతాం

**బెజ్జూర్, జూలై 3, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంతవరకు పోరాడుతామని పిఆర్టియుటిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చునార్కర్ అనిల్ కుమార్ అన్నారు. బెజూర్ మండలంలోని సలగుపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం పిఆర్టియుటిఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంటెంకి తిరుపతి, మోల్కర్ సుభాష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా హెల్త్ కార్డుల సేవలను వినియోగంలోకి తేవాలని, వారికి రావలసిన పెండింగ్లో ఉన్న ఆరు డిఏలను తక్షణమే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించి సమస్యలను పరిష్కరించేంతవరకు పోరాడుతామని జిల్లా ప్రధాన కార్యదర్శి చునార్కర్ అనిల్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడే రాహుల్, జిల్లా కార్యదర్శి డోంగ్రె సంతోష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



